క్లుప్తంగా

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు బుధవారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.100 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

కొత్తకోటలో మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, నిందితులతో ఎస్ఐ

సి.బెళగల్: మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి గ్రామంలో సోదాలు నిర్వహించామని చెప్పారు. పంప్‌హౌస్ వద్ద గ్రామానికి చెందిన తెలుగు తిమ్మప్ప మరో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. వారి నుంచి 7 బాక్సులలో 336 మద్యం సీసాలను(180 ఎంఎల్), మద్యం తరలింపునకు వినియోగించిన రెండు స్కూటర్లను సీజ్ చేశామని ఎస్ఐ వెల్లడించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న అధికారులు

సి.బెళగల్: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ శకుంతల పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలను పూర్తి స్థాయిలో చేపట్టాలని, గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేపట్టిన సర్వేలను పూర్తి చేయించాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా చూడాలన్నారు. కొన్ని సచివాలయాల్లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, లబ్ధిదారుల ఈకేవైసీని వందశాతం పూర్తి చేయించాలని ఆదేశించారు.

ఉద్యాన సాగు లాభదాయకం

పాణ్యం: మండలంలోని మెట్ట భూముల్లో ఉద్యాన సాగు విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఏపీఓ విజయరాణి అన్నారు. బుధవారం పాణ్యం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నీషియన్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూపొందించిన ప్రణాళికలకు తగ్గట్టు పనులు చేయాలన్నారు. రైతుల్లో చైతన్యం తెచ్చి మెట్ట పొలాల్లో లాభసాటి వ్యవసాయమైన ఉద్యాన పంటలపై దృష్టి సారించేలా చూడాలని సూచించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

బుగ్గరామేశ్వరస్వామి పల్లకీ సేవ



ఉత్సవమూర్తులను పల్లకీపై ఊరేగిస్తున్న భక్తులు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన భ్రమరాంబికా, బుగ్గరామేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు వివిధ రూపాల్లో స్వామివారు భక్తులక దర్శనమిచ్చారు. కల్యాణోత్సవం, ప్రభోత్సవం, రథోత్సవం, వసంతోత్సవం, పారువేట వంటి పూజాదికాలు నిర్వహించారు. చివరి రోజు ఉత్సవమూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనారాయణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకీపై కొలువుదీర్చి బాజాభజంత్రీల నడుమ కాల్వ గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కోడుమూరు: కోడుమూరు-కర్నూలు రహదారిలోని పొలాల్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం దాడి చేసి కోడుమూరుకు చెందిన 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు. వారి నుంచి రూ.51,500ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఐదు బైక్‌లను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

వేలంపాట మరోసారి వాయిదా

గూడూరు: మున్సిపల్ వేలం పాటలు మరోసారి వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ వి.ప్రసాద్‌రెడ్డి బుధవారం తెలిపారు. వారపు సంత మార్కెట్, పెద్ద పశువుల మార్కెట్, పెద్ద పశువుల కమేళకు నిర్వహించిన వేలాలకు ఎవరూ రాకపోవడండతో వాయిదా వేసినట్లు తెలిపారు.

ప్రగతి పథంలో గొందిపర్ల

- గ్రామంలో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత
- రూ.4.87 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి సౌకర్యం
- రూ.1.80 కోట్లతో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్స్
- మన బడి నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- సంక్షేమ పథకాల ద్వారా పేదలకు రూ.31.67 కోట్ల ఆర్థిక ప్రయోజనం

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు అంటారు. 2019 ముందు వరకు చాలా గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఏళ్ల గడిచినా సమస్యలకు పరిష్కారం లభించని పరిస్థితి. గుంతల రోడ్లు.. వీధుల్లో ప్రవహిస్తున్న మురుగు, దుస్థితికి చేరుకున్న పాఠశాలలు, ప్రభుత్వ భవనాలతో దర్శనమిచ్చేవి. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. సీసీరోడ్లు, పాఠశాల భవనాలు, సచివాలయాలు, డ్రైనేజీ కాలువలతో పాటు ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. అలాంటి ఓ పంచాయతీ గొందిపర్ల.

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల మేజర్ గ్రామ పంచాయతీ. పంచాయతీలో దొడ్డిపాడు, పూలతోట మజరా గ్రామాలుగా, వసంతనగర్, ఇందిరమ్మ కాలనీలు ఉన్నాయి. గ్రామ జనాభా 5,675 మంది. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో గ్రామ పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాలువలు కూడా సక్రమంగా లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత ప్రాధాన్యతగా పనులను గుర్తించి రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించారు. ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు.

రూ.4.87 కోట్లతో గ్రామాభివృద్ధి..!

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే స్వరాజ్యం దిశగా ప్రభుత్వ సేవలను ప్రజల దగ్గరకు చేర్చేందుకు గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతి సచివాలయంలో 8 నుంచి 10 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఇంటి ముంగిటకే సంక్షేమాన్ని తీసుకొచ్చేందుకు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. స్వగ్రామంలోనే వివిధ ధృవీకరణ పత్రాలను తీసుకునే విధంగా చర్యలు తీసుకుంది. రైతులకు విత్తనాలు, రాయితీ ఎరువులను అందించేందుకు ఆర్‌బీకేలు, ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకొచ్చి అందరికీ ఆరోగ్య పరీక్షలు చేసింది. ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేందుకు విలేజ్ క్లినిక్‌లను, పిల్లలకు మరింత జ్ఞానాన్ని పెంచేందుకు డిజిటల్ లైబ్రరీలను సైతం ఏర్పాటు చేసింది. రెండు సచివాలయాలను రూ.90 లక్షలతో, రెండు హెల్త్ క్లినిక్‌లు రూ.40 లక్షలు, ఆర్‌బీకే సెంటర్లు రూ.50 లక్షలతో నిర్మించారు. అదే విధంగా ఇందిరమ్మ కాలనీలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, రూ.26 లక్షలతో డ్రైనేజీ కాలువలు, రూ.6 లక్షలతో పూలతోటలో డ్రైనేజీ కాలువలు, రూ.20 లక్షలతో గొందిపర్లలో సీసీరోడ్లు, గొందిపర్ల నుంచి ఇందిరమ్మ కాలనీకి బీటీ రోడ్డు రూ.35 లక్షలు, తాగునీటి పైపులకు, కొళాయిలకు ఎంపీ ల్యాండ్స్ నుంచి రూ.97 లక్షలు, రెండు 10 హెచ్‌పీ పంప్‌సెట్‌లకు, రూంకు రూ.10 లక్షలు, శానిటరీ కాంప్లెక్స్‌లు రూ.6 లక్షలు, సీఎండీఎఫ్ నిధుల కింద దొడ్డిపాడులో రూ.4.80 లక్షలతో 3 హెచ్‌పీ పంప్ సెట్లు ఏర్పాటు చేశారు. పూలతోటలో ఇంటింటికి కొళాయిలకు రూ.18.45 లక్షలు, ఇందిరమ్మ కాలనీకి శాశ్వత తాగునీటి సదుపాయానికి రూ.52.2 లక్షలు కేటాయించారు. కాలనీ నుంచి పూలతోట వరకు మట్టి రోడ్డు, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.



గొందిపర్ల పంచాయతీలో వేసిన సీసీరోడ్డు

సంక్షేమ పథకాల లబ్ధి వివరాలు

ప్రత్యక్ష ప్రయోజనం:	లబ్ధిదారుల సంఖ్య	అందించిన లబ్ధి (రూ.లలో)
జగనన్న అమ్మ ఒడి	717	3,40,76,419
జగనన్న విద్యా దీవెన	350	98,20,367
జగనన్న వసతి దీవెన	299	46, 24,461
వైఎస్సార్ రైతు భరోసా	572	2,70,05,150
వైఎస్సార్ పంటల బీమా	446	1,39,44,135
సున్నావడ్డీ- పంట రుణాలు (రైతులు)	146	4,36,583
రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ	23	1,87,804
వైఎస్సార్ పెన్షన్ కానుక	818	7,93,33,750
వైఎస్సార్ చేయూత	436	2,02,68, 750
వైఎస్సార్ ఆసరా	749	1,39,23,269
వైఎస్సార్ సున్నా వడ్డీ :		
(పొదుపు సంఘాలు)	1259	38,30,431
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	426	1,25,60,572



గ్రామంలో వేసిన సిమెంట్ రోడ్డు

అభివృద్ధికి ప్రాధాన్యత



మా గ్రామం కర్నూలు నగరానికి దగ్గరలోనే ఉంటుంది. చాలా ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని సమస్యలు ఈ ప్రభుత్వంలో పరిష్కారమయ్యాయి. పంచాయతీ పరిధిలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి సదుపాయాలు, మరోవైపు సంక్షేమ పథకాలతో గ్రామాలు సుభిక్షంగా ఉన్నాయి. కాలనీలకు తాగునీరు, రోడ్ల సదుపాయాలను కల్పిస్తున్నాం. చాలా సంతోషంగా ఉంది. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలను అందించేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ బాగుంది. ఇంటి దగ్గరకే వైద్యులు వచ్చి చికిత్స చూస్తున్నారు.

– బోయ శ్రీనివాసులు, సర్పంచ్, గొందిపర్ల

అభివృద్ధిలో దూసుకపోతుంది



గతంలో ఎప్పుడూ లేని విధంగా మా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి గుంతలుగా ఉండేది. ప్రస్తుతం బీటీ రోడ్డు వేశాం. తాగునీటికి సైతం శాశ్వత పరిష్కారం చేసేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తున్నారు. పేదలకు విద్య, వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. గతంలో ఏ సర్టిఫికేట్ కావాలన్నా కర్నూలుకి వెళ్లాల్సి వచ్చేది.. నేడు సచివాలయంలో రోజుల వ్యవధిలోనే ఇస్తున్నారు. –కె.క్రిష్ణవేణి, ఎంపీటీసీ సభ్యురాలు



డ్రైనేజీ కాలువ



ఇందిరమ్మ కాలనీలో గతంలో ఇలా..



రోడ్డు వేసిన తర్వాత

గీతాంజలి మృతికి నివాళి



కొవ్వొత్తుల ర్యాలీలో ప్రజాప్రతినిధులు, నాయకులు

కోడుమూరు : తెనాలికి చెందిన గీతాంజలి మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెనాలికి చెందిన గీతాంజలి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని సంతోషంగా వివరిస్తూ సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టుపై టీడీపీ-జనసేన నాయకులు దారుణంగా ట్రోల్‌చేసి ఆమె ఆత్మహత్యకు కారకులయ్యారన్నారు. గీతాంజలి మృతికి కారకులైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని గీతాంజలి ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు అనసూయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ముల్లా సలీం, రామక్రిష్ణారెడ్డి, భాస్కరరెడ్డి, బందెనవాజ్, మాజీ ఎంపీటీసీ రంగన్న, మాజీ సర్పంచ్‌లు రంగన్న, ఉసేనాళం తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లల విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రూ.2.07 కోట్లతో పులకుర్తి హైస్కూల్ నూతన భవనం
- ప్రారంభించిన కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్



నూతన భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కోట్ల హర్షవర్ధన్, సతీష్

కోడుమూరు రూరల్: పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తున్నారని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. బుధవారం కోడుమూరు మండలం పులకుర్తి గ్రామంలో నాడు-నేడు 2వ విడత కింద రూ.2.07 కోట్లతో నిర్మించిన హైస్కూల్ అదనపు తరగతి గదుల భవనాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అధునాతన హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వంటి సంక్షేమ పథకాలతో ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదివేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ప్రభుత్వ పాఠశాలలను, విద్యను నిర్లక్ష్యం చేయడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోలేని పరిస్థితి నెలకొందన్నాను. విద్యార్థులకు మంచి భవిష్యత్తు కావాలంటే మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

జిల్లాకే తలమానికం పులకుర్తి హైస్కూల్

నాడు-నేడు నిధులు రూ.2.07 కోట్లతో నిర్మించిన పులకుర్తి హైస్కూల్ భవనం కర్నూలు జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్ అన్నారు. మంజూరైన నిధులతో పాటు దాతల సహకారం, సొంత నిధులతో హైస్కూల్ భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ శ్రీనాథ్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఇందిరవరప్రభ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పులకుర్తి హైస్కూల్ నూతన భవనం

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి



ప్యాలకుర్తిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న కోట్ల హర్షవర్ధన్, సతీష్

కోడుమూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ అన్నారు. బుధవారం సాయంత్రం ప్యాలకుర్తిలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు, సేవలను తెచ్చారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని, ప్రజలంతా గత ఎన్నికల్లో మాదిరే మరోసారి బుద్ధి చెప్పాలని కోరారు. ప్రజలకు మేలు చేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, మౌలాలి, సర్పంచ్ మెహరున్‌బీ, సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, ఎంపీటీసీలు అనసూయమ్మ, సాంతప్ప, మాజీ సర్పంచ్‌లు రంగన్న, ఉసేనాళం, నాయకులు ముల్లా సలీం, రామక్రిష్ణారెడ్డి, భాస్కరరెడ్డి, బందెనవాజ్, పండ్ల ఉసేన్, ఆశన్న, జుట్ల వెంకటేశ్వర్లు, మిన్నెల్ల, సుధాకర్, మహానంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళా ఖైదీ మృతి

కర్నూలు : కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తూ అనారోగ్యానికి గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బషీరున్నీసా (46) కోలుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందారు. నెల్లూరు జిల్లా కందుకూరు గ్రామానికి చెందిన ఈమె కూతురిని హత్య చేసిన కేసులో 2019లో శిక్ష ఖరారయ్యింది. కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తోంది. అనారోగ్యానికి గురికావడంతో మూడు రోజుల క్రితం అక్కడి పోలీసులు తీసుకువచ్చి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందింది. జైలు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

కోలుకోలేక వ్యక్తి మృతి...

కర్నూలు : నగరంలోని పాతబస్తీ బొంగుల బజార్‌కు చెందిన ఆటోడ్రైవర్ హుసేన్ కుమార్ (24)చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈయనకు పెళ్లి కాలేదు. వీరు నలుగురు అన్నదమ్ములు. తన గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని మనస్థాపంతో వారం రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందినట్లు సోదరుడు రంగస్వామి తెలిపారు. ఈ మేరకు అందిన ఫిర్యాదుతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పది పరీక్షలకు వేళాయె

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ కోటయ్య

పాణ్యం: పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పబ్లిక్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే కేంద్రాలకు సంబంధించి సౌకర్యాలపై ఉన్నతాధికారులు పరిశీలించి నివేదకను పంపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లతో పాటు విద్యార్థులకు బెంచీలు ఉన్నాయా లేదా అనే అంశంపై పరిశీలించారు.

విద్యార్థుల వివరాలు

మండలంలో ప్రభుత్వ, రెసిడెన్సియల్, ప్రైవట్ పాఠశాలలు కలిపి మొత్తం 17 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1182 మంది విద్యార్థులు ఈ ఏడాది పరీక్షలు రాస్తున్నారు. వీరిలో బాలురు-615, బాలికలు-567 ఉన్నారు. మండలంలోని గోరుకల్లు, కొండజుటూరు పాఠశాలల విద్యార్థులు నంద్యాల మండలం పొలూరులో పరీక్ష రాస్తారు. అలాగే మద్దూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నంద్యాల మండలం చాపిరేవు, క్రాంతినగర్‌లోని సెంటర్లలో రాయనున్నారు. ఈ మూడు పాఠశాలలకు సంబంధించి 72 మంది విద్యార్థులు నంద్యాల మండలంలో పరీక్షలకు హాజరుకానున్నారు. ఇక పాణ్యం మండలంలో మొత్తం 4 సెంటర్లు కేటాయించారు. పాణ్యం-280, విజయానికేతన్-300, బలపనూరు-220, నెరవాడమెట్టలో 260 మందికి పరీక్షలు రాయనున్నారు.

పరీక్ష షెడ్యూల్

ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పది పరీక్షలకు ఇప్పటికే ఆయా పాఠశాలలకు హాల్‌టికెట్లు జారీ చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని, ఉదయం 9 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మొత్తం 7 పేపర్లకు సంబంధించి పరీక్షలు జరుగుతాయని ఎంఈఓ కోటయ్య తెలిపారు.